హైదరాబాద్‌లో పినాకిల్ కొత్త సెంటర్

లీజుకు 21వేల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్

హైదరాబాద్/న్యూఢిల్లీ, అక్టోబర్ 16: అమెరికాకు చెందిన ప్రముఖ ఇండస్ట్రియల్ రిలయబిలిటీ సొల్యూషన్స్ కంపెనీ పినాకిల్.. హైదరాబాద్‌లో ఓ కొత్త సెంటర్‌ను తీసుకువస్తున్నది. ఈ క్రమంలోనే కో-వర్కింగ్ సేవల సంస్థ స్కూటర్ వద్ద 21,000 చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్‌ను లీజుకు తీసుకున్నది. దీని సీటింగ్ సామర్థ్యం 350. ఈ మేరకు ఈ లీజింగ్ డీల్‌కు మధ్యవర్తిత్వం వహించిన గ్లోబల్ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ దిగ్గజం కొల్లీర్స్ ఇండియా సోమవారం ఓ ప్రకటనలో తెలియజేసింది. గురుగ్రామ్‌కు చెందిన స్కూటర్.. హైదరాబాద్‌లో దాదాపు 3 లక్షల చదరపు అడుగుల్లో 'మై హోమ్ ట్విట్జా' పేరుతో ఓ నూతన సెంటర్‌ను తెస్తున్నది. ఈ నెలలోనే అందుబాటులోకి వస్తుంది. ఇక్కడ 3,500 డెస్కులున్నాయి. ఇందులోనే పినాకిల్‌కు ఆఫీస్ స్పేస్‌ను స్కూటర్ అందించింది. కాగా, హైదరాబాద్‌లో స్కూటర్ పోర్ట్‌ఫోలియో సుమారు 5 లక్షల చదరపు అడుగులుగా ఉన్నది. ఐటీ, తయారీ, బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ తదితర రంగాల్లోని కంపెనీలు ఇప్పుడు హైదరాబాద్‌కు తొలి ప్రాధాన్యతనిస్తున్నాయని, దీంతో ఇక్కడ కమర్షియల్, ఇండస్ట్రియల్ రియల్ ఎస్టేట్‌కు డిమాండ్ పెరిగిందని స్కూటర్ వ్యవస్థాపకుల్లో ఒకరైన పునీత్ చంద్ర ఈ సందర్భంగా అంటున్నారు.

అనంత్ రాజ్ నయా ప్రాజెక్ట్

హైదరాబాద్‌లో సరసమైన ధరల్లో ఓ హౌజింగ్ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నట్టు రియల్టీ సంస్థ అనంత్ రాజ్ లిమిటెడ్ సోమవారం ప్రకటించింది. అలాగే దక్షిణ ఢిల్లీలో ఓ బహుళ వినియోగ ప్రాజెక్టునూ కంపెనీ చేపడుతుండగా.. ఈ రెండు ప్రాజెక్టుల మొత్తం డెవలప్‌మెంట్ ఏరియా 17 లక్షల చదరపు అడుగులుగా ఉన్నది. ఢిల్లీ ప్రాజెక్టు 7 లక్షల చదరపు అడుగుల్లో రానుండగా, హైదరాబాద్ ప్రాజెక్టు 10 లక్షల చదరపు అడుగుల్లో నిర్మాణం కానున్నట్టు తెలుస్తున్నది. అయితే ఈ ప్రాజెక్టుల వ్యయానికి సంబంధించిన వివరాలను సంస్థ తెలియపర్చలేదు.

జోరుగా ఫ్లాట్ల అమ్మకాలు

హైదరాబాద్‌సహా దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఈ ఏడాది జనవరి-సెప్టెంబర్ మధ్య అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్ల అమ్మకాలు జోరుగా సాగాయి. గత ఏడాది ఇదే వ్యవధితో పోల్చితే ఈసారి విక్రయాలు 21 శాతం పెరిగినట్టు ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టెంట్ జేఎల్‌ఎల్ ఇండియా సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ జనవరి-సెప్టెంబర్‌లో 1,96,227 యూనిట్లు అమ్ముడైనట్టు వివరించింది. నిరుడు 1,61,575 యూనిట్లుగానే ఉన్నట్టు పేర్కొన్నది. ఈ క్రమంలో 2022లో జరిగిన మొత్తం అమ్మకాల్లో ఈ ఏడాది ఇప్పటికే 91 శాతం జరిగిపోయాయన్నది. గత ఏడాది 2,15,000 యూనిట్ల అమ్మకాలు జరిగాయని, దీంతో ఈ ఏడాది అంతకుమించే నమోదు కావచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. వచ్చే పండుగ సీజన్ ఇందుకు కలిసిరాగలదన్న ఆశాభావాన్ని వెలిబుచ్చింది. ఇదిలావుంటే ఈ జనవరి-సెప్టెంబర్‌లో కొత్త అపార్ట్‌మెంట్ల ద్వారా అందుబాటులోకి వచ్చిన ఫ్లాట్లు కూడా 21 శాతం ఎగిసి 2,23,905 యూనిట్లుగా ఉండటం గమనార్హం. నిరుడు 1,84,317 యూనిట్లుగానే ఉన్నాయి. హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, పుణె నగరాలపై జేఎల్‌ఎల్ తాజా నివేదిక విడుదలైంది. గృహ రుణాలపై వడ్డీరేట్లు స్థిరంగా ఉండటం మార్కెట్‌కు కలిసొస్తున్నదని జేఎల్‌ఎల్ ఇండియా రెసిడెన్షియల్ విభాగం అధిపతి శివ కృష్ణన్ చెప్పారు.

28న గ్లోబల్ కార్పొరేట్ సదస్సు

హైదరాబాద్, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మరో అంతర్జాతీయ సదస్సుకు వేదిక కాబోతున్నది. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో ఈ నెల 28న గ్లోబల్ కార్పొరేట్ సమ్మిట్ 2023ని నిర్వహిస్తున్నారు. రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టీసీసీఐ ప్రధాన కార్యాలయంలో జరగనున్న ఈ సదస్సులో పరిశ్రమల రంగంలో పెట్టుబడులు, ఆర్థికపరమైన అంశాలు, భవిష్యత్తు వ్యూహాలు, సుస్థిరాభివృద్ధి, సంపద సృష్టి తదితర అంశాలపై చర్చించనున్నారు. సౌత్ సుడాన్ ప్రధాని ప్రత్యేక సలహాదారు, మాజీ ఐఎఫ్ఎస్ అధికారి డాక్టర్ దీపక్ వోహ్రా సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఈ సదస్సుకు తెలంగాణ రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ పర్వీందర్ సింగ్ గౌరవ అతిథిగా పాల్గొంటున్నారు.

సెలెక్ట్ మొబైల్స్‌లో దసరా ఆఫర్లు

హైదరాబాద్, అక్టోబర్ 16: ప్రముఖ మొబైల్ రిటైల్ సంస్థ సెలెక్ట్ మొబైల్స్..దసరా పండుగ సందర్భంగా 'గ్రేట్ ఫెస్టివల్ డేస్' పేరుతో ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆన్‌లైన్ కంటే రూ.5 వేల వరకు తగ్గింపు ధరతో ఉత్పత్తులను కస్టమర్లకు అందిస్తున్నట్టు కంపెనీ సీఎండీ వై గురు తెలిపారు. సరికొత్త స్మార్ట్‌ఫోన్లను కొనుగోలు చేసిన వారికి పలు బ్యాంక్ ఆఫర్లు కూడా అందుబాటులోకి తీసుకొచ్చినట్టు చెప్పారు. వీటిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఈజీ ఈఎంఐపై 10 శాతం ఇన్‌స్టాంట్ డిస్కౌంట్, ఐసీఐసీఐ ఫైనాన్స్‌పై రూ.10 వేల వరకు క్యాష్‌బ్యాక్, బజాజ్ ఫిన్‌సర్వ్‌పై రూ.9 వేల వరకు క్యాష్‌బ్యాక్, ఎస్బీఐ క్రెడిట్ అండ్ డెబిట్ కార్డులపై 5 శాతం తక్షణ క్యాష్‌బ్యాక్ వంటి రాయితీలు కూడా పొందవచ్చునని తెలిపింది. అలాగే రూ.6,999కే ఎల్‌ఈడీ టీవీ, ఎల్‌ఈడీ టీవీ ధరకే క్యూలెడ్ టీవీ, ఎల్‌ఈడీ టీవీ-సౌండ్ బార్‌పై ప్రత్యేక కాంబో ఆఫర్, బ్రాండెడ్ స్మార్ట్‌వాచ్ రూ.999 నుంచి, ఇయర్‌బడ్స్ రూ.799 నుంచి, ల్యాప్‌టాప్ కొనుగోలుపై రూ.3,999 విలువైన ల్యాప్‌టాప్ కిట్ ఉచితంగా అందిస్తున్నట్టు చెప్పారు. అలాగే మిషన్ ఈ-వేస్ట్‌లో భాగంగా ఇంట్లో పనిచేయని పాత ఎలక్ట్రానిక్ పరికరాలు సెలెక్ట్ స్టోర్లలో ఉన్న ఈ-వేస్ట్ బాక్స్‌లో వేయడంతో రూ.10 వేల వరకు డిస్కౌంట్‌ను పొందవచ్చునని తెలిపింది.

హైదరాబాద్‌లో ఏసర్ ఈ-బైక్ యూనిట్

రూ.120 కోట్లతో ఏర్పాటు

ఏసర్ ఈ బైక్‌ను మార్కెట్లోకి విడుదల చేస్తున్న సినీ హీరో నిఖిల్

హైదరాబాద్, అక్టోబర్ 16: హైదరాబాద్‌లో మరో ఈ బైకుల తయారీ సంస్థ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. ఇప్పటికే పలు సంస్థలు ఇక్కడ యూనిట్లను నెలకొల్పగా తాజాగా ఏసర్.. నగరంలో అసెంబ్లింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రకటించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కంపెనీ సీవోవో హరి కిరణ్ మాట్లాడుతూ.. వచ్చే 6 నెలల్లో ప్లాంట్ కోసం రూ.120 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్టు చెప్పారు. ప్రస్తుతం సంస్థలో 100 మంది సిబ్బంది ఉండగా, కొత్త యూనిట్ వస్తే 400కి చేరుతుందన్నారు.

ఏసర్ ఎంయూవీఐ 125 4జీ

దేశీయ ఈ-స్కూటర్ మార్కెట్‌కు ఏసర్ తమ తొలి స్కూటర్ ఎంయూవీఐ 125 4జీని పరిచయం చేసింది. ఈ స్కూటర్ ధరను రూ.99,999గా నిర్ణయించింది. సింగిల్ చార్జ్‌తో 80 కిలోమీటర్లు ప్రయాణించే ఈ స్కూటర్ గంటకు 75 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదు. బ్యాటరీ చార్జింగ్‌తో ఇబ్బందులు పడుతున్న కస్టమర్లను దృష్టిలో పెట్టుకొని ఈ స్కూటర్‌లోని బ్యాటరీని వేరు చేసి చార్జింగ్ చేసుకునే వీలు కల్పించినట్టు కంపెనీ సీఈవో ఇర్ఫాన్ ఖాన్ తెలిపారు. వచ్చే 6 నెలల్లో రెండు స్కూటర్లు, ఈ-బైస్కిల్లు, ఈ-బైకులు, ఈ-ట్రిక్స్‌లను విడుదల చేయనున్నామన్నారు. ప్రస్తుతం ఈ వాహనాలు పుణెలో ఏర్పాటు చేసిన ప్లాంట్లో తయారు చేస్తున్నట్టు చెప్పారు. బజాజ్ చేతక్, టీవీఎస్ ఐక్యూబ్, ఒకినవా స్కూటర్లకు పోటీగా సంస్థ ఎంయూవీఐ 125 4జీ విడుదల చేసింది.

అదానీ ఎయిర్‌పోర్ట్స్‌పై విమానయాన సంస్థలు గుస్సా

క్రికెట్ కప్ పేరుతో చార్టర్డ్ ఫ్లైట్స్ చార్జీల పెంపు

న్యూఢిల్లీ, అక్టోబర్ 16: ప్రస్తుతం కొనసాగుతున్న క్రికెట్ ప్రపంచ కప్ సందర్భంగా అదానీ గ్రూప్ ఎయిర్‌పోర్ట్స్ చార్జీల భారీ పెంపుపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలంటూ విమానయాన కంపెనీలు ఫిర్యాదు చేశాయి. అదానీ గ్రూప్ నిర్వహణలోని అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చే చార్టర్డ్ ఫ్లైట్స్ గ్రౌండ్ హ్యాండ్లింగ్ ఛార్జీలను హఠాత్తుగా పెంచుతున్నట్టు ప్రకటించింది. ఈ చార్జీలను 10 రెట్లు పెంచేసినట్టు ఎయిర్‌లైన్ కంపెనీలు ఆరోపిస్తున్నాయి. దీనిపై అందిన ఫిర్యాదులపై ఎయిర్‌పోర్ట్ ఎకానమీ రెగ్యులేటరీ అథారిటీ (ఏఈఆర్ఏ) స్పందిస్తూ అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ యాజమాన్యానికి నోటీసులు జారీచేసింది. ఈ వివాదాన్ని నేరుగా పరిష్కరించేందుకు తమతో తక్షణమే సమావేశమవ్వాలని ఎయిర్‌పోర్ట్ యాజమాన్యాన్ని ఆదేశించింది. అలాగే దేశంలోని అన్ని ఎయిర్‌పోర్టుల నిర్వహణా సంస్థలూ తన అనుమతి లేకుండా చార్జీలు పెంచరాదన్నది.

సెప్టెంబర్‌లోనే టారిఫ్ లిస్ట్ విడుదల

అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదిత చార్జీల పెంపుపై టారిఫ్ లిస్ట్‌ను సెప్టెంబర్‌లోనే విడుదల చేసింది. 15 మందికిపైగా ప్రయాణీకులతో కూడిన చార్టర్డ్ ఫ్లైట్స్‌కు కనీసం రూ.2,65,000 జనరల్ ఏవియేషన్ చార్జీలను, ఇందుకు అదనంగా 15 మంది తర్వాత ప్రతీ ఒక్క ప్రయాణీకుడికి రూ.17,667 చొప్పున చార్జీ విధించింది. గత ఐపీఎల్ సందర్భంగా పాసింజర్‌కు రూ.6,000 చొప్పున వసూలు చేసిన అనుబంధ చార్జీలను కూడా తాజా చార్జీలకు కలిపింది. ఈ చార్జీలన్నీ ల్యాండింగ్, పార్కింగ్ ఫీజులకు అదనం.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభం 16,811 కోట్లు

ముంబై, అక్టోబర్ 16: దేశీయ ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విశ్లేషకుల అంచనాలకుమించి రాణించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.16,811 కోట్ల నికర లాభాన్ని గడించింది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.11,162 కోట్ల లాభంతో పోలిస్తే భారీగా పెరిగింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనమైన తర్వాత విడుదల తొలి ఆర్థిక ఫలితాలు ఇవే కావడం విశేషం. ఏడాది క్రితం రూ.46,181 కోట్లుగా ఉన్న బ్యాంక్ ఆదాయం గత త్రైమాసికానికిగాను రూ.78,406 కోట్లకు చేరుకున్నట్టు బ్యాంక్ బీఎస్ఈకి సమాచారం అందించింది.

- నికర వడ్డీ మార్జిన్ 3.4 శాతంగా నమోదైంది.
- ఏడాది ప్రాతిపదికన నికర వడ్డీ ఆదాయం 6.7 శాతం పెరిగి రూ.27,385 కోట్లకు చేరుకున్నది.
- ఆపరేటింగ్ లాభం 30.5 శాతం అధికమై రూ.22,694 కోట్లకు చేరింది. నిర్వహణ ఖర్చులు 37.2 శాతం ఎగబాకి రూ.15,399 కోట్లకు చేరాయి.
- బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 1.23 శాతం నుంచి 1.34 శాతానికి పెరిగాయి.
- స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి బ్యాంక్ షేరు స్వల్పంగా తగ్గి రూ.1,529 వద్ద ముగిసింది.

ప్యాసింజర్ వాహనాలకు గిరాకీ

జూలై-సెప్టెంబర్‌లో హోల్‌సేల్ అమ్మకాల్లో రికార్డు: సియామ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 16: దేశీయ ప్యాసింజర్ వెహికిల్ హోల్‌సేల్ అమ్మకాలు పరుగులు పెట్టాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) జూలై-సెప్టెంబర్‌లో మునుపెన్నడూ లేని విధంగా నమోదయ్యాయి. భారతీయ ఆటో మొబైల్ తయారీదారుల సంఘం (సియామ్) సోమవారం తెలిపిన వివరాల ప్రకారం గత నెల సెప్టెంబర్ ఆఖరుతో ముగిసిన మూడు నెలల కాలంలో ఆయా ఆటో రంగ సంస్థల నుంచి డీలర్లకు 10,74,189 యూనిట్లు వెళ్లినట్టు తేలింది. గత ఆర్థిక సంవత్సరం (2022-23) ఇదే త్రైమాసికంలో 10,26,309 యూనిట్లుగా ఉన్నట్టు స్పష్టం చేసింది. దీంతో 4.7 శాతం వృద్ధి నమోదైనట్టైంది. యుటిలిటీ, స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్స్‌కు పెరిగిన డిమాండే కారణమని పేర్కొన్నది.

ఏప్రిల్-సెప్టెంబర్‌లో..

ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధం (ఏప్రిల్-సెప్టెంబర్)లోనూ ప్యాసింజర్ వాహనాల హోల్‌సేల్ అమ్మకాలు రికార్డును సృష్టించాయి. తొలిసారి 20 లక్షల మార్కును అధిగమించడం గమనార్హం. గతంలో ఎప్పుడూ 6 నెలల్లో ఈ స్థాయిలో టోకు విక్రయాలు నమోదు కాలేదు. ఈసారి 20,70,163 యూనిట్లుగా ఉన్నాయి. పోయినసారి 19,36,804 యూనిట్లుగా ఉన్నట్టు సియామ్ తెలిపింది.

ఆదరణ లేని ఎంట్రీ లెవల్

ప్రారంభస్థాయి వాహనాలకు మార్కెట్‌లో డిమాండ్ పడిపోతున్నదని సియామ్ తెలియజేసింది. ఎంట్రీ లెవల్ కార్ హోల్‌సేల్ అమ్మకాలు ఈ జూలై-సెప్టెంబర్‌లో 35,000 యూనిట్లుగా ఉన్నాయి. అదే 2018-19 జూలై-సెప్టెంబర్‌లో 1.38 లక్షలుగా ఉన్నట్టు సియామ్ గుర్తుచేసింది. ఇక ఈ జూలై-సెప్టెంబర్‌లో ఎంట్రీ లెవల్ టూవీలర్ వాహన హోల్‌సేల్ విక్రయాల్లోనూ తగ్గుదల కనిపించిందని చెప్పింది. గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిగా డిమాండ్ పుంజుకోకపోవడమే కారణంగా అభివర్ణించింది. అయితే ప్యాసింజర్ వెహికిల్స్, త్రీవీలర్స్, కమర్షియల్ వెహికిల్ సేల్స్‌లో వృద్ధి క్రమేణా పెరుగుతున్నట్టు సియామ్ ఈ సందర్భంగా పేర్కొన్నది.

- ఈ జూలై-సెప్టెంబర్‌లో 45,98,442 యూనిట్లకు మొత్తం ద్విచక్ర వాహనాల హోల్‌సేల్ అమ్మకాలు పతనం. నిరుడు ఇదే వ్యవధిలో 46,73,931 యూనిట్లుగా నమోదు.
- ఈ సెప్టెంబర్‌తో ముగిసిన 3 నెలల కాలంలో వాణిజ్య వాహన హోల్‌సేల్ సేల్స్ 2,47,929 యూనిట్లకు పెరుగుదల. గత ఏడాది ఇదే సమయంలో 2,31,991 యూనిట్లు.
- మొత్తం త్రిచక్ర వాహన హోల్‌సేల్ విక్రయాలు ఈ రెండో త్రైమాసికంలో 1,95,215 యూనిట్లుగా ఉన్నాయి. నిరుడు 1,20,319 యూనిట్లుగా ఉన్నాయి.
- ఈ జూలై-సెప్టెంబర్‌లో అన్ని రకాల వాహన హోల్‌సేల్ అమ్మకాలు 61,16,091 యూనిట్లుగా నమోదు. గత ఏడాది ఇదే త్రైమాసికంలో 60,52,739 యూనిట్ల విక్రయాలు జరిగాయి.
- సెప్టెంబర్ నెలలోనే ప్యాసింజర్ వాహన టోకు విక్రయాలు 3,61,717 యూనిట్లుగా నమోదయ్యాయి. నిరుడు ఇదే నెల 3,55,043 యూనిట్లు డీలర్ల వద్దకు వెళ్లాయి. దీంతో 2 శాతం పెరిగినట్టైంది.
- అలాగే ద్విచక్ర వాహన హోల్‌సేల్ అమ్మకాలు ఈ సెప్టెంబర్‌లో 17,49,794 యూనిట్లకు పెరిగాయి. గత ఏడాది 17,35,199 యూనిట్లుగా ఉన్నాయి.
- గత నెల 74,418 యూనిట్లకు పెరిగిన దేశీయ మొత్తం త్రిచక్ర వాహన హోల్‌సేల్ విక్రయాలు. నిరుడు 50,626 యూనిట్లకే పరిమితమయ్యాయి.
- ఈ ఏడాది సెప్టెంబర్‌లో అన్ని రకాల వాహనాల హోల్‌సేల్ అమ్మకాలు 21,41,208 యూనిట్లు. గత ఏడాది సెప్టెంబర్‌లో 20,93,286 యూనిట్లుగా ఉన్నాయి.

ప్యాసింజర్ వాహన విభాగంలో ఈ రికార్డు అమ్మకాల వృద్ధి.. యుటిలిటీ, స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాలకు ఏర్పడిన భారీ డిమాండ్‌తోనే సాధ్యమైంది. ప్రస్తుతం మొత్తం వాహన విక్రయాల్లో యుటిలిటీ, స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాల వాటానే దాదాపు 60 శాతంగా ఉంటున్నది. ఈ పండుగ సీజన్‌తో ప్రస్తుత అక్టోబర్-డిసెంబర్‌లో వాహన విక్రయాలు మరింత పెరుగవచ్చు. ఇదే జరిగితే దేశ ఆర్థిక వృద్ధికి అవి దోహదపడుతాయి.

-వినోద్ అగర్వాల్, సియామ్ అధ్యక్షుడు

ఆకట్టుకున్న బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

న్యూఢిల్లీ, అక్టోబర్ 16: ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర(బీవోఎం) ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మొండి బకాయిలు తగ్గుముఖం పట్టడం, వడ్డీల మీద వచ్చే ఆదాయం పెరగడంతో గత త్రైమాసికానికిగాను రూ.920 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.535 కోట్ల లాభంతో పోలిస్తే ఇది 72 శాతం అధికం. ఏడాది క్రితం రెండో త్రైమాసికంలో రూ.4,317 కోట్లుగా ఉన్న బ్యాంక్ ఆదాయం గత త్రైమాసికానికిగాను రూ.5,796 కోట్లకు ఎగబాకినట్టు బ్యాంక్ ఎండీ ఏఎస్ రాజీవ్ తెలిపారు. దీంట్లో వడ్డీల ద్వారా రూ.5,068 కోట్ల ఆదాయాన్ని గడించింది. నికర వడ్డీ మార్జిన్ 3.55 శాతం నుంచి 3.89 శాతానికి చేరుకోగా, స్థూల నిరర్థక ఆస్తుల విలువ 3.40 శాతం నుంచి 2.19 శాతానికి దిగొచ్చినట్టు వెల్లడించారు. అలాగే నికర ఎన్‌పీఏ కూడా 0.68 శాతం నుంచి 0.23 శాతానికి దిగొచ్చింది. మరో రెండు త్రైమాసికాల వరకు డిపాజిట్లు, రుణాలపై వడ్డీ రేట్లు పెరిగే అవకాశాలు లేవని ఆయన స్పష్టం చేశారు.

- నికర వడ్డీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 28.88 శాతం పెరిగి రూ.2,432 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇది రూ.1,887 కోట్లుగా ఉన్నది.
- గత త్రైమాసికంలో ఆపరేటింగ్ ప్రాఫిట్ రూ.1,462 కోట్ల నుంచి రూ.1,920 కోట్లకు పెరిగాయి.
- ప్రొవిజన్ కవరేజ్ రేషియో 96.06 శాతం నుంచి 98.40 శాతానికి పెరిగాయి.
- మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.597 కోట్ల నిధులను వెచ్చించింది. గతేడాది ఇది రూ.532 కోట్లుగా ఉన్నది.
- వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో అధిక వ్యవసాయ రుణాలు మొండి బకాయిల జాబితాలోకి చేరాయి.
- బ్యాంక్ అడ్వాన్స్‌లు 23.55 శాతం పెరిగి రూ.1,83,122 కోట్లకు చేరుకున్నాయి.

సవాళ్లను ఒడిసిపట్టి గెలవాలి

ఎన్ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ పిలుపు

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): దేశీయ మైనింగ్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను ఇంజినీర్లు అవకాశాలుగా మలుచుకోవడం ద్వారా జీడీపీ అభివృద్ధికి కృషి చేయాలని ఎన్ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఎన్ఎండీసీ కార్యాలయంలో సోమవారం జరిగిన మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎంఈఏఐ) హైదరాబాద్ చాప్టర్ జనరల్‌బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. దేశంలో గుర్తించబడిన మైనింగ్ నిల్వలు 22 శాతం ఉన్నాయని, వాటిలో సమగ్ర అన్వేషణ జరిగినవి 6 శాతం మాత్రమేనని, వీటిలో ప్రస్తుతం 2 శాతంలో మాత్రమే మైనింగ్ జరుగుతున్నదని తెలిపారు. అభివృద్ధి పథంలో దేశం ముందుకు సాగుతున్న ప్రస్తుత తరుణంలో ఈ 2 శాతాన్ని రెట్టింపు చేస్తే జీడీపీలో మైనింగ్ రంగం వాటా 4 శాతానికి చేరుతుందని చెప్పారు. సమావేశంలో అసోసియేషన్ జాతీయ మాజీ అధ్యక్షులు ఎండీ ఫషీయుద్దీన్, వీడీ రాజగోపాల్, ఎంఈఏఐ సెక్రటరీ జనరల్ నరసయ్య, హైదరాబాద్ చాప్టర్ మాజీ అధ్యక్షుడు బీఆర్‌వీ సుశీల్ కుమార్, ఎన్ఎండీసీ టెక్నికల్ డైరెక్టర్ వినయ్‌కుమార్, కమర్షియల్ డైరెక్టర్ విశ్వనాథ్ సురేశ్, ప్రొడక్షన్ డైరెక్టర్ దిలీప్‌కుమార్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

కొత్త కమిటీ చైర్మన్‌గా వినయ్‌కుమార్

ఈ సమావేశంలో ఎన్ఎండీసీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వినయ్‌కుమార్, ఉపాధ్యక్షునిగా డాక్టర్ ఎమ్మెస్ వెంకట్రామయ్య, కార్యదర్శిగా ఎల్ కృష్ణ, సంయుక్త కార్యదర్శిగా వీ బాలకోటిరెడ్డి, కోశాధికారిగా డాక్టర్ ఎస్‌కే సింహంతోపాటు 9 మంది సభ్యులు ఎన్నికయ్యారు.

ఫ్రెయర్ ఎనర్జీకి 58 కోట్ల నిధులు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ): సౌర విద్యుత్తు రంగంలో పనిచేస్తున్న ఫ్రెయర్ ఎనర్జీకి రూ.58 కోట్ల పెట్టుబడులు రానున్నట్టు సహ వ్యవస్థాపకులు రాధిక, సౌరభ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధుల సమీకరణతో తమ వ్యాపార కార్యకలాపాలు మరింత విస్తృతం చేస్తామని పేర్కొన్నారు. సోలార్ విద్యుత్తు ఉత్పత్తితో పాటు మార్కెటింగ్ మరింత విస్తరణకు అవసరమైన పెట్టుబడులు ఈక్విటి కంపెనీల నుంచి వచ్చాయని వివరించారు. ఇందులో ఈడీఎఫ్ ఎలక్ట్రిఫై, షిండర్ ఎలక్ట్రిక్ ఎనర్జీ ఏసియా, మేబైట్, వీటీ క్యాపిటల్ కంపెనీలు కలిసి మొత్తం రూ.58 కోట్లను పెట్టుబడిగా పెట్టనున్నాయని వారు తెలిపారు.

జియో ఫైనాన్షియల్ అదుర్స్

న్యూఢిల్లీ, అక్టోబర్ 16: జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ జూలై-సెప్టెంబర్‌లో కంపెనీ నికర లాభం రెండింతలు పెరిగి రూ.668.18 కోట్లుగా నమోదైంది. ఏడాది క్రితం రూ.331.92 కోట్లే. కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 47 శాతం ఎగబాకి రూ.414.13 కోట్ల నుంచి రూ.608.04 కోట్లకు చేరుకున్నది.

మూడోరోజూ అదే తీరు

భారీగా నష్టపోయిన దేశీయ స్టాక్ మార్కెట్లు

ముంబై, అక్టోబర్ 16: దేశీయ ఈక్విటీ మార్కెట్లు వరుసగా మూడోరోజూ కూడా నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా ట్రేడవడం, క్రూడాయిల్ ధర రాకెట్ వేగంతో దూసుకుపోవడం, మధ్యప్రాచ్యంలో నెలకొన్న రాజకీయ అస్థిరత కారణంగా సూచీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. ఒక దశలో 240 పాయింట్లకు పైగా నష్టపోయిన బీఎస్ఈ సెన్సెక్స్ చివరకు 115.81 పాయింట్లు నష్టపోయి 66,166.93 వద్ద స్థిరపడింది. మరో సూచీ నిఫ్టీ కూడా 19.30 పాయింట్లు తగ్గి 19,731.75 వద్ద నిలిచింది. నెస్లె, టీసీఎస్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, కొటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌యూఎల్‌లు భారీగా నష్టపోయాయి. కానీ, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, యాక్సిస్ బ్యాంక్, పవర్ గ్రిడ్, మహీంద్రాఅండ్ మహీంద్రాలు లాభపడ్డాయి. మార్కెట్లు వరుసగా మూడు రోజులుగా తగ్గుతూ వచ్చాయి..ఆసియా మార్కెట్లు బలహీనంగా ట్రేడవడం, బ్యాంకింగ్, రియల్టీ, ఐటీ రంగ షేర్లలో భారీగా క్రయవిక్రయాలు జరగగా, మెటల్, ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్ కాస్త లాభపడటంతో భారీ నష్టాల నుంచి గట్టెక్కగలిగిందని దలాల్ స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. రంగాలవారీగా చూస్తే టెలికం, రియల్టీ, టెక్, ఎఫ్ఎంసీజీ, సేవలు, బ్యాంకింగ్, ఐటీ రంగ షేర్లు నష్టపోగా..కమోడిటీస్, కన్స్యూమర్, ఎనర్జీ, ఇండస్ట్రియల్స్, ఆటో, మెటల్ రంగ సూచీలు లాభపడ్డాయి.